ఒండ్రుమట్టితో భూమి సారవంతం


ఏఓ అనంతలక్ష్మి

గుడ్లవల్లేరు: ఒండ్రు మట్టిని ఉపయోగించి ఎలాంటి ఎరువుల ఖర్చు లేకుండానే పంటలు పండించుకోవచ్చు. ఈ మట్టిని వాడిన భూములు సారవంతంగా మారతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వ్యవసాయ సాగు భూముల్లో ఒక రైతును చూసి మరొకరు బస్తాల కొద్దీ రసాయనాల్ని దిమ్మరించటం చాలా మందికి పరిపాటి అయిపోయింది. ఒకరిని బట్టి ఒకరు ఈ సాగు పోకడలవలన ఆశించిన స్థాయిలో నాణ్యతతో పాటు ఆరోగ్యకరమైన పంటలను ఇచ్చే భూములు కాస్తా నిస్తేజమవుతున్నాయి. సారం కోల్పోతున్న ఇలాంటి భూముల్లో ఇంకా రసాయనాల వాడకాలు భయంకరంగా పెరిగిపోతున్నాయి. ఈ విధానాలతో మనిషికి ఆరోగ్యంతో పాటు భూమికి పోషక సామర్థ్యం దిగజారిపోతుంది. ఇలాంటి భూములను సారవంతం చేయటమే మార్గమని గుడివాడ రూరల్ మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి తెలిపారు. ఈ భూములకు ఒండ్రు మట్టిని వాడటమే సరైన మార్గమని ఆమె ఇస్తున్న సలహాలు ఇలా ఉన్నాయి.

ఎరువులకు పెట్టుబడి లేకుండానే..

సాగు నేలలను సారవంతం చేసుకునే పనిలో రైతులు ఉన్నారు. ఈ తరుణంలో పూర్వ కాలం నుంచి కొన్ని గ్రామాల్లోని చెరువులను తవ్వకుండా ఉంటారు. అలాంటి చెరువులు తవ్వినపుడు వచ్చే ఒండ్రు మట్టిని ఉపయోగించి ఎలాంటి ఎరువుల ఖర్చు లేకుండానే పంటలు పండించుకోవచ్చు. ఈ మట్టిని వాడిన భూములు సారవంతంగా మారతాయి. వీటికి పోషకాలు పెంపొందించబడి కొత్త ఊపిరి వస్తుంది. అలా చేపలు, రొయ్యలను సాగు చేస్తున్న చెరువుల్లో మట్టిని పంట పొలాలకు వాడరాదు. అలాంటి చెరువులు కాకుండా తాగునీటి, సాగునీటి, వాడుక నీటి చెరువులు, గుంతల్లోని ఒండ్రు మట్టినే పొలాల్లో వేస్తే ఎంతో ఉపయోగం ఉంటుంది.


ఒండ్రు మట్టి ఉండే చెరువు

ఒండ్రులో ఉండే పోషకాలెన్నో..

ఒక కిలో ఒండ్రు మట్టిని పరిశీలిస్తే అందులో పోషకాలు అమోఘంగా ఉంటాయి. నత్రజని 720 మిల్లీగ్రాములు, భాస్వరం 35 మిల్లీగ్రాములు, పొటాష్ 310 మిల్లీగ్రాములు, గంధకం 18 మిల్లీగ్రాములు, సేంద్రీయ కర్బనం 0.5 మిల్లీగ్రాములు, జింక్ 2.8 మిల్లీగ్రాములు, బోరాన్ 0.8 మిల్లీగ్రాములు ఉంటాయి. అంతేగాక మేలు చేసే మిత్ర జీవుల సాంద్రత 308 మిల్లీగ్రాములు ఉండటంతో చీడపీడల నుంచి పంటలు రక్షించబడతాయి.

ఒండ్రుతో బహు ప్రయోజనాలు

ఒండ్రు మట్టి వేసిన పొలాల్లో చీడపీడలు పంటలకు ఆశించకుండా మిత్ర సూక్ష్మజీవులు చేరి, పంటలకు మేలు చేకూరుస్తాయి. సాగునేల గుల్లబారుతుంది. ఈ మట్టి సేంద్రియ ఎరువుల తరహాలో పంటలకు ఉపకరిస్తోంది. చెరువుల్లోకి వరద రావటం వలన ఎగువ నుంచి కొట్టుకొచ్చి, చేరే ఒండ్రు మట్టి సారవంతంగా ఉండి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఎకరానికి 10 ట్రాక్టర్ల వరకూ వచ్చే ఒండ్రు మట్టిని పొలాల్లో వేసుకోవచ్చు. పంటలు సాగు చేయక ముందే మట్టిని తొలి కలియదున్ని సాగు చేసేందుకు సిద్ధంగా ఉంచాలి. పండ్లు, కూరగాయల తోటల పంటలకు ఒండ్రు మట్టి బాగా ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువైనా పేడ కూడా వెంటనే పంటలకు ఉపయోగపడదు. మరుసటి ఏడాదికి గాని పోషకాలు మొక్కలకు అందుతాయి. ఒండ్రు మట్టి మాత్రం అదే ఏడాది మొక్కలకు పోషకాలు అందిస్తుంది. చెరువు మట్టి వేసిన పొలాలు తేమను నిల్వ ఉంచుకుంటాయి. శక్తి పెంచుకుని నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటాయి. రోగ నిరోధక శక్తి పెరగటంతో చీడపీడల బారినుంచి పంటలు రక్షించబడతాయి. ఒకసారి మట్టిని పొలాల్లో వేస్తే నాలుగేళ్ల వరకూ పంటలకు పుష్కలంగా పోషకాలు అందుతాయి.

ఈ మట్టిని వినియోగించుకునే మార్గాలివి..

- కొన్ని చెరువుల్లో క్షార గుణం కలిగిన మట్టి ఉంటే దానిని పొలాల్లోకి వాడితే పంటలు పండవు.
- చెరువులో మట్టిని ముందుగా దగ్గరలోని వ్యవసాయాధికారికి పంపించి భూసార పరీక్షలు చేయించటం మంచిది.
- చెరువుల్లో మూడు అడుగుల లోతు వరకే మట్టిని వాడుకోవాలి.
- పైపైన ఉండే మట్టిలోనే పూర్తి స్థాయిలో పోషకాలు ఉంటాయి.
- మూడు అడుగుల లోతు కంటే ఎక్కువగా ఉండే మట్టిని పొలాల్లో వాడినా ప్రయోజనం లేనట్లే.
- అలాంటి మట్టిని పొలానికి గట్లు వేసుకునేందుకు ఉపయోగించుకోవచ్చు.

క్లుప్తంగా

ప్రధానికి స్వాగతం పలికిన బీజేపీ నాయకులు



గుడివాడ టౌన్: భారత ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్రమోదీకి గుడివాడకు చెందిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు బుధవారం గన్నవారం ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ప్రధానమంత్రికి స్వాగతం పలకడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని రాజబాబు అన్నారు. రాజబాబుతో పాటు బీజేపీ జిల్లా నాయకులు ఆయన వెంట ఉన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ అప్పిరెడ్డి రాజీనామా



పమిడిముక్కల: కృష్ణాపురం పీఏసీఎస్ చైర్మన్ తమ్మా అప్పిరెడ్డి తన పదివికి రాజీనామా చేసినట్లు బుధవారం తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని గుడివాడ డివిజనల్ కోపరేటివ్ అధికారికి పంపినట్లు పేర్కొన్నారు. తనకు రెండు సార్లు అవకాశం కల్పించినందుకు మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పంట కాలువ పూడికతీత పనులు



మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరంలో రూ.79 వేల ఉపాధి హామీ నిధులతో 67 మంది ఉపాధి హామీ కూలీలు బుధవారం పంట కాలువ పూడికతీత పనులు చేపట్టారు. ఎంటీఏ ఎస్.నవీన్ మాట్లాడుతూ ఈ పనుల ద్వారా రైతుల పంట పొలాలకు సాగునీరు సమృద్ధిగా చేరుతుందన్నారు. అలాగే తాగునీటి చెరువులు, పంట బోదెలు మరమ్మతులు చేయడం ద్వారా ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలు తీరతాయని తెలిపారు. చెరువుల అభివృద్ధితో పశువులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

కోడ్ ముగిసినా ముసుగులు తీయరా!



గుడివాడ టౌన్: ఎన్నికల కోడ్ ఈ నెల 6వ తేదీన ముగిసినప్పటికీ ప్రముఖ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించకపోవడాన్ని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, మాజీ శాసన సభ్యులు విగ్రహాలు పట్టణంలోని మెయిన్ రోడ్‌లో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికీ ఆయా విగ్రహాలకు కప్పిన ముసుగులు తీయకపోవడం విచారకరమని ప్రజలు అంటున్నారు. కాగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి మాత్రం ఈనెల 6వ తేదీ సాయంత్రమే ముసుగు తొలగించడానికి ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముసుగులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం



పామర్రు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు గురువారం ఉదయం నుంచి తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలను శుభ్రం చేయటం తదితర పనులలో పాఠశాల సిబ్బంది నిమగ్నమయ్యారు. మండలంలో మొత్తం 46 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత ఏడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఉదయం 9గంటల నుంచి అన్ని పాఠశాలలు ప్రారంభం అవుతాయని ఎంఈఓ–2 పద్మవాణి పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత మగ్గం శిక్షణ

కైకలూరు: స్థానిక శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ సమీప సేవాసమితిలో ఉచిత మగ్గం జర్దోషి కోర్సులు గురువారం నుంచి ఉచితంగా అందిస్తామని బుధవారం నిర్వాహకులు తెలిపారు. ఈ కోర్సుల్లో మహిళలకు 37 రోజులపాటు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. బ్యాంకర్ల అభివృద్ధి సంస్థ ప్రోత్సాహంతో ఈ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

పద్యనాటకోత్సవాలు ప్రారంభం

ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహణ

చల్లపల్లి(అవనిగడ్డ): స్థానిక ఎన్టీఆర్ పార్కులో పద్యనాటోత్సవ కార్యక్రమాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో బోలెం భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో చేపట్టిన ఈ నాటకోత్సవాలను కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని–మల్లేశ్వరి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అవనిగడ్డకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆలోచింపజేసిన పర్యావరణ ప్రాణదాత నాటకం..

ఈ సందర్భంగా ప్రదర్శించిన పర్యావరణ ప్రాణదాతల నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. తాటిచెట్టు ఉపయోగాలు, ఈ చెట్లను ఇష్టారాజ్యంగా కొట్టేయడం వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలను రంగస్థల కళాకారుడు బోలెం రామారావు ప్రధాన పాత్రలో చేసిన అభినయం విశేషంగా ఆకట్టుకుంది. జాషువా చెప్పులు కుట్టే పాత్రధారిగా రామారావు నటన ప్రేక్షకులను కట్టిపడేసింది. దేశ నాయకుల ఫొటోలు చూపిస్తూ వారి జీవిత విశేషాలను తెలియజేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రముఖ కోలాటం గురువు వేముల అంకంభొట్లు, ఏఓ బోలెం అనంతలక్ష్మి, నాగమునేష్, నిర్దేష్ సాయి, జిన్నీ వారి వారి పాత్రల్లో జీవించారు. స్వచ్ఛసుందర చల్లపల్లి నిర్వాహకుడు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఈవోపీఆర్‌డీ దాసి సీతారామరాజు, రంగస్థల కళాకారుడు పుప్పాల వీరాంజనేయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్, బుల్లా కిశోర్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ ప్రాణదాతల నాటకంలో ఒక దృశ్యం

దేవస్థానం పొలంలోకి మురుగునీరు

పామర్రు: గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన సాగుభూమి స్థానిక విజయవాడ రోడ్డులోని పెట్రోల్ బంక్ ఎదురుగా సుమారు 5.90 ఎకరాలు ఉంది. దీనిని కౌలుకు ఎండోమెంట్ అధికారులు అప్పగించారు. ఈ భూమిలోకి చుట్టు పక్కల వారి మురుగు నీటిని తరలించడం కారణంగా పంట సక్రమంగా పండక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కౌలుదారుడు వల్లభనేని బుల్లిబాబు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం బయట నుంచి వచ్చే మురుగునీరు పంట పొలంలోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయించినట్లు తెలిపారు. తన పొలంలోకి మురుగునీరు వస్తోందని, సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు తెలియజేసినా ఆయన స్పందించడం లేదని బుల్లిబాబు పేర్కొన్నారు. దీంతో తానే స్వయంగా మురుగునీరుకి అడ్డుకట్ట వేయించినట్లు పేర్కొన్నారు.


దేవస్థానం పొలంలోకి మురుగునీరు వెళ్లకుండా అడ్డుకట్ట వేసిన రైతు

ఈ గోతిని పూడ్చించరూ..

గుడివాడ టౌన్: స్థానిక సత్యనారాయణపురం నాలుగో లైను రాజదర్బార్ వీధిలో ఏర్పడిన గోతిని పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు. వేసవిలో స్థలం యజమాని సుమారు 10 అడుగుల లోతు మట్టిని వేరే ప్రాంతానికి తరలించారు. దీంతో ఏర్పడిన గొయ్యి వర్షపునీటితో నిండిపోయింది. గోతిలో భారీగా దోమలు చేరడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోంది. నీటి ఊటకు స్థలాన్ని అనుకుని ఉన్న సీసీ రోడ్డుసైతం పగిలిపోవడం ప్రారంభించిందని స్థానికులు తెలిపారు.

పొరపాటున అటుగా వెళ్లే వాహనం అదుపు తప్పితే వాహనదారులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదంకూడా ఉందని స్థానికులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి స్థలం యజమానితో గోతిని పూడ్చించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


వర్షపునీటితో నిండి ప్రమాదకరంగా మారిన గొయ్యి

డ్రెయిన్‌లో పడిపోయిన చేపల లోడులారీ

బంటుమిల్లి: మండల పరిధిలో బంటుమిల్లి–గుడివాడ రోడ్డులో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పిన లారీ పెదతుమ్మిడి మీడియం డ్రెయిన్‌లో బోల్తా కొట్టింది. వివరాల్లోకి వెళితే.. బుధవారం ఏపీ39టీఏ 4689 నంబరు లారీ కైకలూరులో చేపల లోడు చేసుకుని బీహార్ రాష్ట్రానికి వెళ్లేందుకు బయలుదేరింది. బంటుమిల్లి వద్ద 216 జాతీయ రహదారి ఎక్కేందుకు బంటుమిల్లి రోడ్డులో వస్తోంది. ఈ క్రమంలో పెదతుమ్మిడి మీడియం డ్రెయిన్‌పై ఉన్న వంతెన బలహీనంగా ఉండటంతో ఎదురుగా వేగంగా వస్తున్న కారును తప్పించబోయి లారీ అదుపు తప్పి డ్రెయిన్‌లోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి స్థానికులు తరలించారు. కైకలూరులో యజమానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.


పెదతుమ్మిడి డ్రెయిన్‌లో బోల్తా కొట్టిన చేపల లోడు లారీ

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈఓ కెఎస్.రామరావు పాల్గొని స్వామి వారికి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని భక్తులు వీక్షించి తరించారు. అనంతరం శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించినా, పాల్గొన్న భక్తుల ఇంట ఇబ్బందులు తొలగిపోతాయని, వివాహం కాని వారికి వివాహ యోగం, సంతానం లేని వారికి సంతాన యోగం కలుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

● విలువైన బాల్యం.. చెత్త సేకరణకే పరిమితం


కైకలూరు టౌన్‌హాల్ ఎదుట జాతీయ రహదారిపై చెత్త రిక్షాను నడుపుకుంటూ వెళుతున్న బాలికలు

బాల కార్మికుల నిర్మూలన కాగితాలకే పరిమితమవుతోంది. బడిలో పలకాబలపం పట్టాల్సిన చేతులు రిక్షా బండిని నడుపుతున్నాయి. విలువైన బాల్యం చెత్త కుప్పల చుట్టూ తిరుగుతోంది. రెక్కాడితే గానీ డొక్కాడని పారిశుద్ధ్య కార్మికుల జీవితాల్లో వెలుగు నిండటం లేదు. తల్లిదండ్రులతో పాటు బాలలూ తమ రాత ఇంతేనంటూ విలువైన జీవితాలను చెత్త సేకరణకు అంకితం చేస్తున్నారు. ప్రపంచ బాలికార్మిక వ్యతిరేక దినోత్సవం బుధవారం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకున్నారు. కైకలూరులో బడికెళ్లాల్సిన ఇద్దరు బాలికలు మాత్రం చెత్తను సేకరించి ఇదిగో ఇలా వెళుతున్నారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– కైకలూరు

కార్యకర్తలకు అండగా ఉంటా



కైకలూరు: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. ఏలూరు రోడ్ పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ ఇటీవల వెలువడిన సార్వత్రిక ఫలితాలపై ఎవరూ అధైర్యపడవద్దన్నారు. ఎన్నికలలో జయాపజయాలు సహజమన్నారు. అధికారపక్ష నేతలు కవ్వింపు చర్యలకు ఎవరూ తొందరపడవద్దన్నారు. నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున అందించామన్నారు. లోపం ఎక్కడ జరిగిందో తెలుసుకుని క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళదామన్నారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు చేసే ఆగడాలను పార్టీ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అందరం కలసికట్టుగా తిరిగి పార్టీ వైభవానికి కృషి చేయాలని చెప్పారు.

20 మంది దివ్యాంగుల గుర్తింపు

మండవల్లి: మండలంలో 20 మంది దివ్యాంగులను గుర్తించినట్లు ఎంఈఓ డి.రామారావు, ఐఈఆర్టీలు టి.అరుణకుమారి, జి. వసంత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన రాజగోపాలస్వామి కల్యాణోత్సవాలు

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో కొలువై ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకుని టెంకాయలు, బియ్యం, అగరవత్తులు సమర్పించి తమ కోర్కెలు ఈడేర్చమని ప్రార్థించారు. ఆలయ అర్చకులు గౌతమ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యుడు రాము, శివాజీ పాల్గొన్నారు.

23న కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు (మర్రిపాలెం) ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం గం.9 నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. నేత్ర వైద్య పరీక్షల వివరాల కోసం మొబైల్ నంబర్లు 94906 36466, 70936 17778లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

కోదండ రాముడికి లక్ష తులసీ దళార్చన



మచిలీపట్నంటౌన్: నగరంలోని నిజాంపేట శ్రీ కోదండ రామాలయం ప్రథమ వార్షిక ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా రెండో రోజైన బుధవారం స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామికి లక్ష తులసీదళార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం సీతారాముల శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా తీర్థప్రసాదాలు అందజేశారు. గురువారం కూడా ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఘనంగా మరియతల్లి గ్రామోత్సవం



ఉల్లిపాలెం(కోడూరు): మండల పరిధిలోని ఉల్లిపాలెం ఏసు తిరుహృదయ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి) వందేళ్ల వేడుకల్లో భాగంగా బుధవారం మరియతల్లి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో మరియమాత స్వరూపాన్ని ఉంచి విశ్వాసులు భుజాలకెత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. కోడూరు ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు చౌటపల్లి ప్రశాంత్ విశ్వాసుల ఇళ్ల వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా విశ్వాసులు మరియతల్లి స్వరూపానికి ఎదురేగి ఆమె పాదాలను ముద్దాడి చేతులు జోడించి నమస్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ భక్తులు గ్రామోత్సవంలో ముందుకు సాగారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌సీఎం సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు పర్యవేక్షించారు.

కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకల్లేపల్లి పవిత్ర కృష్ణానది ఒడ్డున వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. అందులో బాగంగా బుధవారం ఉదయం 8.10 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, రాత్రికి మహా శాంతి హోమాలు నిర్వహించారు. సాయంత్రం సర్వతోభద్ర మండప ఆవాహన కలశస్థాపన తోపాటు ఆలయం ఎదుట మహాశివుని రూపంలో దీపారాధనలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రుద్రాభిషేకం పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.